ళ్ళ ఆ జీవి ఆర్తనాదం ఆపలేదు. వూర్లో కంట తడిపెట్టని ప్రాణి లేదు. నాలుగోనాటికి వాళ్ళు మంటల గురించిన స్పృహ జారి పోతూంది సోమప్పకు. మూలుగు మొదలయింది. చుట్టూ వున్నవాళ్ళు పలకరించటానికి ప్రయత్నం చేస్తున్నారు. అతని నోరు పెకలించుకొని రెండుమాటలు వచ్చి ఆగినాయి—— 'స్వామి సల్లగా సూడాల అయితే ..' కొరవ మాటలు స్వామికే వినిపించేందుకువెళ్ళిపోయినాడుసోమప్ప.

"ఒరే దేవునికి ఎంత కనికరం లేక పోయిందిరా" ఒక ముసలి గొంతు వాపోయింది.

"దేవుడు చేసేదేముంది పెద్దయ్యా, వయసు కండలు కలిగి నన్నాళ్ళు దుంకి బయటికి ఈదినాడు. బాగ దళిలి పోయినాడు మనిషి. పోయిన ఏడు బయట పడేదే కష్టమై పోయింది. ఈ యేడన్నా ఇంక గుండంలో దూకేది మానుకో మామా అంటే నామాట ఇన్లేదు..." పెద్దగొంతు

'ఆయుస్సు తీరింది. ఆస్వామే పిలుచ్చుకు పోయినాడప్పా తనతావుకి. ఆయన మహత్యానికి మనం ఎదురు సెప్పే వాళ్ళమా.........' ఒక ముసలవ్వ.

స్వామి మహత్తును గురించి ఆలోచనలో పడినాడు పెద్దన్న.

(వాస్తవ ఘటన ఆధారంగా)

మినీకథ :

# ఇద్దరూ ఇద్దరే

మల్లాది వెంకటకృష్ణమూర్తి

శేషసాయిని, ఆమె స్నేహితురాలు మాట్లాడుకుంటున్నారు. శేషసాయి భర్త అఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి తన భార్యని చూసి కొద్దిగా కోపంగా తిట్టాడు ఆమె భర్త నెమ్మదిగా.

అఫీసులో అలసిపోయి నేనింటికొచ్చేసరికి జిడ్డు కారుతున్న మొహంతో మాసిన బట్టలతో ఏమిటీ అవతారం? కాస్తంత శుభ్రంగా వుండలేవూ?"

ఆ మాటలు శేషసాయి స్నేహితురాలి చెవిన పడనే పడ్డాయి. పక్కవాటాలోనే అద్దెకు వుంటోంది ఆ అమ్మాయి. ఆ అమ్మాయికి కొత్తగా పెళ్ళయింది. వెంటనే తన వాటాలోకి వెళ్ళి గబ గబా మొహం కడుక్కుని, పౌడర్ రాసుకుని ఇస్త్రీ చీర కట్టుకుని, పువ్వులు పెట్టుకుని భర్త రాకకోసం ఎదురు చూడసాగింది: ఆయన వచ్చాడు. పోకు చేసుకొని వున్న తన భార్యని చూసి అడిగాడు విసుగ్గా. "ఎక్కడికీ బయలుదేరావు?"